క్లుప్తంగా

తాళ్లపూడిలో 70 మందికి కంటి పరీక్షలు



తాళ్లపూడిలో వైద్య పరీక్షలు చేస్తున్న నేత్ర వైద్యులు

తాళ్లపూడి: ఆర్యవైశ్య సంఘం మండల శాఖ, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం తాళ్లపూడిలోని శ్రీవాసవీ ఆర్యవైశ్య సంఘం సత్రం వద్ద ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆర్య వైశ్య సంఘం మండల గౌరవాధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు ప్రారంభించారు. రాజమహేంద్రవరంలోని గౌతమీ నేత్రాలయ వైద్యులు ఉచితంగా వైద్య పరీలు నిర్వహించారు. నేత్ర వైద్యులు బాబీ, సత్యవతి 70 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 20 మందికి కళ్ల జోళ్లు అవసరమని, 10 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఈ వైద్య శిబిరంలో గోకవరపు బాబులు, కంకిపాటి వినయ్, పీఆర్‌వో కమలేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారిగా కృష్ణకాంత్ నియామకం

కొవ్వూరు: రాజమహేంద్రవరంలోని ఆర్యాపురం కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు నూతన పాలకవర్గ ఎన్నికల అధికారిగా కొవ్వూరు డివిజనల్ సహకార అధికారి వి.కృష్ణకాంత్ నియమితులయ్యారు. ఆ బ్యాంకు ఎన్నికకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత నోటిఫికేషన్ జారీ చేసినట్టు కృష్ణకాంత్ బుధవారం తెలిపారు. వచ్చే నెల 11న నామినేషన్ల స్వీకరణ, 13 వరకూ నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందన్నారు. జూలై 20న ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జూలై నాలుగో తేదీ నాటికి అర్హత కలిగిన ఓటర్ల తుది జాబితాను ప్రకటిస్తామన్నారు.

చాగల్లులో వర్షం

చాగల్లు: మండలంలో బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వేసవి ఎండలతో సతమతం అవుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. కొద్ది రోజులుగా భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండడంతో ఎండ వేడిమిని, ఉక్కపోతను తట్టుకోలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం నాటి వర్షంతో ప్రజలు సేద తీరారు. చాగల్లుతో పాటు మండలంలోని ఊనగట్ల, నెలటూరు, మీనానగరం తదితర గ్రామాల్లోనూ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. చిక్కాల, కలవలపల్లి తదితర ప్రాంతాల్లో చెట్ల పై నుంచి మామిడి కాయలు నేలరాయి. రైతుల వ్యవసాయ పనులు కూడా దాదాపు పూర్తి కావడంతో వరి రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ వర్షం ఖరీఫ్‌కు మేలు చేస్తుంది.

ఫలితాలు ఆశ్చర్యకరం

- ప్రజలందరికీ అందుబాటులో ఉంటా
- ఎమ్మెల్యేగా గెలిచిన దుర్గేష్‌కు అభినందనలు
- కోట్లాది రూపాయల వ్యయంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశాం
- మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన ఫలితాలు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించాయని, అవి ఎవరూ ఊహించని విధంగా ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన ఫలితాలు చూసి ప్రతి ఒక్కరూ షాక్‌కు గురయ్యారన్నారు. ఫలితాలు ఏకపక్షంగా రావడాన్ని తాను ఊహించలేదన్నారు. ఎందువల్ల ఇలా జరిగిందో త్వరలోనే సమగ్రంగా సమీక్షిస్తామని చెప్పారు. జనసేన పార్టీ తరఫున నిడదవోలు ఎమ్మెల్యేగా విజయం సాధించిన కందుల దుర్గేష్‌కు ఆయన అభినందనలు తెలిపారు.

అడుగడుగునా అభివృద్ధి..

నిడదవోలు నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేశామని శ్రీనివాస్‌నాయుడు చెప్పారు. ప్రతి గ్రామంలోనూ చేపట్టిన అభివృద్ధి, అందించిన సంక్షేమాన్ని వివరించే కరపత్రాలు వేయించి గ్రామాల్లో పంపిణీ కూడా చేయించామన్నారు. నిడదవోలు పట్టణాభివృద్ధిలో భాగంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి సెంటర్ నుంచి గణేష్ చౌక్ సెంటర్, గణపతి జంక్షన్ వరకూ నాలుగు లేన్ల సీసీ రోడ్డు నిర్మించామన్నారు. అలాగే ఈ ప్రాంతమంతా లాకింగ్ టైల్స్, సెంట్రల్ డివైడర్లు, సెంట్రల్ విద్యుత్ వ్యవస్థతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. గణపతి జంక్షన్‌ను విస్తరిస్తున్నామన్నారు. అంతేగాకుండా పట్టణంలో పార్కుల నిర్మాణం, ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. వీటిలో కొన్ని పనులు పూర్తయ్యాయని, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో ఐదేళ్లలో రూ.700 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.2,400 కోట్లను సంక్షేమ పథకాల రూపంలో నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశామని చెప్పారు. తన తండ్రి జీఎస్ రావుతో కలిసి గత 30 ఏళ్లుగా కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల్లో నీతి, నిజాయితీలతో రాజకీయాలు చేస్తున్నామని శ్రీనివాస్‌నాయుడు చెప్పారు. గెలిచినా, ఓడినా నిత్యం ప్రజలతోనే ఉన్నామన్నారు. ప్రజలు కూడా తమను వదల లేదన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ తమ వెన్నంటి ఉన్నారన్నారు. ఈ ఐదేళ్లు నియోజకవర్గంలో ఎక్కడా గొడవలు లేకుండా శాంతి భద్రతలను కాపాడామని చెప్పారు. భవిష్యత్తులో ఇక్కడే ఉంటూ ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఐదేళ్ళుగా ఎమ్మెల్యే పదవి ఇచ్చిన నియోజకవర్గ ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, పార్టీ మండలాధ్యక్షుడు అయినీడి పల్లారావు, పట్టణ శాఖ కార్యదర్శి గాజుల రంగారావు, ఎస్కే వజీరుద్దీన్, వెలగన పోలయ్య, గజ్జరపు రమేష్, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంతో అభివృద్ధి చేశాం

గత ఐదేళ్లలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని శ్రీనివాస్‌నాయుడు చెప్పారు. ప్రజా సంక్షేమం కోసం, వారి సంపూర్ణ ఆరోగ్యం కోసం, పిల్లల చదువుల కోసం నిబద్ధతతో పని చేశామన్నారు. గూడు లేని పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయించి, పక్కా గృహాలు నిర్మించామన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువుల పింఛన్లను వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేయించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదని ఆయనన్నారు. అలాగే విద్యార్థులు, మహిళలు, రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను అందించామన్నారు. ఈ విధంగా సమాజంలో ప్రతి వర్గానికీ ఏదో ఒక రూపంలో మేలు చేశామన్నారు. అయితే చేసిన మంచిని ప్రజలకు చెప్పడంలో లోపం ఎక్కడ జరిగిందో త్వరలోనే సమీక్షిస్తామని చెప్పారు.

ప్రజాతీర్పును శిరసావహిస్తాం

- మాజీ మంత్రి తానేటి వనిత



దేవరపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తానని రాష్ట్ర మాజీ హోం మంత్రి, గోపాలపురం అసెంబ్లీకి వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసిన తానేటి వనిత అన్నారు. యర్నగూడెంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఎన్నికల్లో తనకు ఓట్లు వేసిన ప్రజలకు, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించిన ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కొనసాగాలని వనిత ఆకాంక్షించారు. ప్రజల పక్షాన నిరంతరం పని చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఎవరూ అధైర్యపడవద్దని ఆమె తెలిపారు. ప్రజాస్వామ్యంలో గెలుపు, ఓటములు సహజమన్నారు. నేటి ఓటమి రేపటి విజయానికి నాంధి అని ఆమె పేర్కొన్నారు. పార్టీ విజయానికి ప్రతి కార్యకర్తా కష్టపడి పనిచేసినప్పటికీ దురదృష్టవశాత్తూ గెలవ లేకపోయామన్నారు. దీనికి ఎవరూ బాధ పడకుండా, గొడవలకు వెళ్లకుండా సంయమనం పాటించాలని తానేటి వనిత విజ్ఞప్తి చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కొవ్వూరులో గోదావరి ఒడ్డునే మొక్కలు నాటుతున్న ఆంధ్రా సుగర్స్ ఫ్యాక్టరీ మేనేజర్ కృష్ణారావు

- ఆంధ్రా సుగర్స్ మేనేజర్ కృష్ణారావు
- గోదావరి తీరంలో వన మహోత్సవం

కొవ్వూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఆంధ్రా సుగర్స్ కర్మాగారం ఆధ్వర్యంలో బుధవారం గోదావరి నదీ తీరం వెంబడి మొక్కలు నాటారు. అంతకు ముందు ఫ్యాక్టరీలోని సిబ్బందికి పర్యావరణ కాలుష్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మానవాళి మనుగడ కోసం ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని పరి రక్షించాలని కర్మాగారం మేనేజర్ ఈవీ కృష్ణారావు కోరారు. భూమిని పునరుద్ధరించడం, కరవును అధిగమించడం ఈ ఏడాది థీమ్‌గా ఎంపిక చేశామన్నారు. మన భూమి, మన భవిష్యత్తు అని ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు. కాలుష్య నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను, ప్రమాణాలను పాటిస్తున్నామన్నారు. సగ్గొడ, కొవ్వూరు ఫ్యాక్టరీల అడిషనల్ జనరల్ మేనేజర్ జి.రమేష్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవశ్యకత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఫ్యాక్టరీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కేవీవీ సత్యనారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో అసిస్టెంట్ జీఎం, హెచ్‌ఆర్ సీహెచ్ సుఖ మహర్షి తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కూడిన ప్ల కార్డుల పట్టుకుని కార్మికులు, సిబ్బంది నినాదాలు చేశారు.



కొవ్వూరులో ప్ల కార్డులు పట్టుకుని నినాదాలు చేస్తున్న ఆంధ్రాసుగర్స్ కార్మికులు, అధికారులు

ప్రాణవాయువు కోసం మొక్కలు పెంచాలి

ఉండ్రాజవరం: స్వచ్ఛమైన ప్రాణ వాయువు పుష్కలంగా లభించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, సంరక్షించాలని మండల విద్యాశాఖాధికారి–2 డి.శారదా జ్యోత్స్న అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల ప్లస్ (బాలికల జూనియర్ కళాశాల)లో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కేఎస్‌కే మాణిక్యాలరావు ఆధ్వర్యంలో ఎంఈవో–1 సీహెచ్ సక్సేనా రాజు, ఎంఈవో–2 డి.శారదా జ్యోత్స్న పాఠశాల ఆవరణలో మామిడి మొక్కలు నాటారు. ఎంఈవో సక్సేనా రాజు మాట్లాడుతూ పర్యావరణం కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం ఈ విద్యా సంవత్సరంలో బాలికల జూనియర్ కళాశాల ఎంపీసీ, సీఈసీ గ్రూపుల్లో చేరుతున్న విద్యార్థినులను ఎంఈఓలు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.ఉదయ భాస్కరరావు, కోట రామప్రసాద్, పి.నిరీక్షణరాజు, బి.పద్మాజారాణి, జి.అజుబా, ఎస్‌డీ శ్రీనివాసరావు, జి.మహేష్ కుమార్, సీహెచ్ దుర్గాప్రసాద్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరం హైస్కూల్ ఆవరణలో మొక్క నాటుతున్న ఎంఈవోలు సక్సేనారాజు, జ్యోత్స్న

వేసవి విజ్ఞాన శిబిరాలు వినియోగించుకోండి



నల్లజర్ల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు

- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు
- నల్లజర్ల శాఖా గ్రంథాలయం సందర్శన

నల్లజర్ల: వేసవి సెలవుల్లో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతగానో ఉపయోగపడ్డాయని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు అన్నారు. నల్లజర్ల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన బుధవారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 74 శాఖా గ్రంథాలయాల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేశామన్నారు. తమ అవసరం మేరకు వాటిని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. శిథిలమైన గ్రంథాలయ భవనాలకు మరమ్మతులు చేయనున్నట్టు చెప్పారు. గ్రంథాలయాలకు కొత్త పుస్తకాలు కొనుగోలు చేశామన్నారు.వేసవి శిక్షణ శిబిరాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించనున్నట్టు చెప్పారు. విద్యార్థులు సరదాగా సెలవులు గడిపేస్తే ఏం ప్రయోజనం ఉండదన్నారు. ఇలా శిక్షణ శిబిరాలకు హాజరై పుస్తకపఠనం, చెస్, చిత్రలేఖనం తదితర అంశాలలో శిక్షణ పొందితే భవిష్యత్తులో ఉపయోగపడుతుందన్నారు. ఆయన వెంట గ్రంథ పాలకురాలు ఏవీ రమణ, రిటైర్డు ఇంజనీర్ ఖాన్‌బాజీ ఉన్నారు.

శివయ్యకు విశేష అభిషేకాలు



ద్వారకాతిరుమల క్షేత్ర పాలకుని ఆలయంలో విశేష పుష్పాలంకరణలో శివదేవుడు



నిడదవోలు పట్టణంలో సోమేశ్వర స్వామివారికి లక్ష బిల్వార్చన

ద్వారకాతిరుమల: క్షేత్ర పాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం శివదేవునికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ముందుగా దేవస్థానం సిబ్బంది ఆలయాన్ని సుగంధ భరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ గర్భాలయంలో కొలువైన శివదేవునికి అర్చకులు, పండితులు ఏకాదశ రుద్రాభిషేకాన్ని నేత్రపర్వంగా జరిపారు. ఈ వేడుకలో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. రాత్రి స్వామివారికి జరగాల్సిన గ్రామోత్సవం వర్షం కారణంగా రద్దయ్యింది.

సోమేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన

నిడదవోలు: మాస శివరాత్రి సందర్భంగా బుధవారం స్థానిక బాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారికి లక్ష బిల్వార్చన, అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు, సహస్రనామ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సోమాల శివ, ఆలయ ప్రధానార్చకుడు శ్రీకాకుళపు లక్ష్మీ నరసింహశాస్త్రి, అభిరామ్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు

చాగల్లు: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా చాగల్లులోని అభయాంజనేయస్వామి వారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృత అభిషేకాలు, తమలపాకుల పూజలు చేశారు. టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండలంలోని పశివేదలకు చెందిన భజన మండలి ఆధ్వర్యంలో భజన కాలక్షేపం నిర్వహించారు.గురువారం స్వామివారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భారీగా భక్తులు విచ్చేసి పాల్గొనాలని కోరారు.

స్కూళ్లు తెరిచే నాటికి పాఠ్య పుస్తకాలు సిద్ధం



చాగల్లు స్టాక్ పాయింట్‌లో పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో వాసుదేవరావు

చాగల్లు: ఈ నెల 12న పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. చాగల్లు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలోని స్టాక్ పాయింట్‌ను ఆయన బుధవారం సాయంత్రం సందర్శించారు. ఇంత వరకూ వచ్చిన స్టాక్ వివరాలు, రావలసిన స్టాక్ వివరాల గురించి ఆరా తీశారు. వచ్చిన స్టాక్‌ను ఆయా పాఠశాలలకు పంపించేందుకు వీలుగా క్రమ పద్ధతిలో కిట్‌లను కేటగిరీల వారీగా అమర్చుకోవాలన్నారు. వర్షం జల్లులు పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈవో –2 శుభాకర్‌కు సూచించారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పెరవలి: మల్లేశ్వరం గ్రామంలో కొత్తగా నిర్మించిన సబ్ స్టేషన్‌లో విద్యుత్ లైన్ల ఏర్పాటు కోసం గురువారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నాలుగు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాను నిలుపుదల చేస్తామని ట్రాన్స్‌కో ఏడీఈ బి.వీరభద్రరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సరఫరాకు అంతరాయం కలిగే అన్నవరప్పాడు, మల్లేశ్వరం, ఖండవల్లి, పిట్టల వేమవరం గ్రామాల విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రధాన పార్టీల అభ్యర్థులకు పోలైన ఓట్లు ఇలా..

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వైఎస్సార్ సీపీ, టీడీపీ అభ్యర్థులకు లభించిన ఓట్ల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. ఎన్నికల్లో 10 మంది అభ్యర్థులు పోటీ చేయగా, వారిలో ఎనిమిది మంది డిపాజిట్లు కోల్పోయారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి తానేటి వనితకు 87,149 ఓట్లు లభించగా, టీడీపీ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజుకు 1,13,676 ఓట్లు లభించాయి. 26,527 ఓట్ల మెజార్టీతో మద్దిపాటి వెంకట్రాజు విజయం సాధించారు.

మండలం	వైఎస్సార్ సీపీ	టీడీపీ	మెజార్టీ
గోపాలపురం	18973	23554	4581
దేవరపల్లి	22966	28989	6023
నల్లజర్ల	23625	33120	9495
ద్వారకాతిరుమల	21585	28013	6428
మొత్తం	87149	1,13,676	26527

మూడు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఆధిక్యం

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల్లో కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్నదేవరపేట, దేచెర్ల, బంగారమ్మపేట గ్రామాల్లోనే వైఎస్సార్ సీపీ స్వల్ప అధిక్యత సాధించింది. మిగిలిన అన్ని గ్రామాల్లోను టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు పైచేయి సాధించారు. తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామంలో గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి 1,818 ఓట్ల మెజార్టీ లభించగా, ఈ సారి కేవలం 84 ఓట్ల మెజార్టీతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. గత ఎన్నికల్లో ఐ.పంగిడి శివారు గ్రామమైన దేచెర్లలో వైఎస్సార్ సీపీ 396 ఓట్ల మెజార్టీ సాధిస్తే ఈ సారి 133 ఓట్ల మెజారిటీ మాత్రమే దక్కింది. ఇక వాడపల్లి శివారు గ్రామమైన బంగారమ్మపేటలో ఈ ఎన్నికల్లో 267 ఓట్ల ఆధిక్యత వైఎస్సా ర్‌సీపీ లభించింది. ఈ గ్రామంలోని 169వ నంబర్ పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థికి 617 ఓట్లు, టీడీపీ అభ్యర్థికి 350 ఓట్లు పోలయ్యాయి.

నియోజకవర్గంలో మొత్తం 176 పోలింగ్ కేంద్రాలు ఉంటే వాటిలో కేవలం 33 చోట్ల మాత్రమే వైఎస్సార్ సీపీ ప్రభావం చూపించింది. తాళ్లపూడిలోని 24వ నంబర్ పోలింగ్ బూత్‌లో 255, పెద్దేవంలోని 30వ నంబర్ బూత్‌లో 194, మలకపల్లిలోని 41వ నంబర్ పీఎస్‌లో 244 ఓట్ల మెజార్టీని వైఎస్సార్ సీపీ సాధించింది. కుమారదేవంలోని 48వ నంబర్ పోలింగ్ బూత్‌లో 168 ఓట్లు, 50వ నంబర్ పోలింగ్ కేంద్రంలో 32, ధర్మవరంలోని 56వ నంబర్ పోలింగ్ బూత్‌లో 262 ఓట్ల మెజార్టీని ఆ పార్టీ సాధించింది. దొమ్మేరులోని 63వ నంబర్ బూత్‌లో 429 ఓట్లు, 65వ నంబర్ బూత్‌లో 46 ఓట్ల మెజారిటీని వైఎస్సార్ సీపీ అభ్యర్థి తలారి వెంకట్రావు సాధించారు. కొవ్వూరు పట్టణంలోని క్రిస్టియన్ పేటలోని 69వ నంబర్ బూత్‌లో గరిష్ఠంగా 480 ఓట్ల మెజార్టీని వైఎస్సార్ సీపీ సాధించగా, 72వ నంబర్ బూత్‌లో 270, 80వ నంబర్ బూత్‌లో 130, ఔరంగాబాద్‌లో 85 ఓట్ల ఆధిక్యత వైఎస్సార్ సీపీకి దక్కింది. చాగల్లు మండలం చిక్కాల గ్రామంలోని 104 వ నంబర్ బూత్‌లో 168 ఓట్లు, 105వ నంబర్ బూత్‌లో ఐదు ఓట్ల మెజారిటీ వైఎస్సార్ సీపీ సాధించింది. చాగల్లులోని 115 వ నంబర్ బూత్‌లో 484, 119వ నంబర్ బూత్‌లో 70, 122వ నంబర్ బూత్‌లో 209 ఓట్ల ఆధిక్యత ఆ పార్టీకి లభించాయి.